క్లుప్తంగా

పెద్దమ్మ తల్లి చల్లంగచూడు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): పెద్దమ్మతల్లి ప్రజలను చల్లంగా ఉండేలా దీవించు తల్లీ.. అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వేడుకున్నారు. శుక్రవారం ఆయన మండలంలోని గుడికందుల పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ దేవతలకు ప్రజలతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లయ్య, రమేశ్‌గౌడ్, నాయకులు భైరాగౌడ్, ఎల్లం, కమలాకర్, కనకయ్య పాల్గొన్నారు.

సొంతింటి కల ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలయ్య

దుబ్బాకటౌన్: నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందని రాయపోల్ ఎంపీడీఓ బాలయ్య అన్నారు. శుక్రవారం రాయపోల్ మండలం రామారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని అబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామారంలో 183 మందికి ఇళ్లు మంజూరయ్యాయని, వారంతా వెంటనే పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి మాధవి, కాంగ్రెస్ నాయకుడు దుర్గాప్రసాద్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మహిళ రైతులకు వ్యవసాయ పరికరాలు



పరికరాలను పంపిణీ చేస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాయితీపై మంజూరైన వ్యవసాయ పరికరాలను స్థానిక రైతు వేదికలో మహిళ రైతులకు ఏఓ వసంతరావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల కొరతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ అవకాశాన్ని మహిళ రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు ఖలీల్, భాను, కవిత, రేఖ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైను పనుల అడ్డగింత



పనులు అడ్డుకున్న రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): తమకు నష్ట పరిహారం చెల్లించాకే రైల్వేలైన్ పనులు చేపట్టాలని మండల పరిధిలోని గంగాపూర్ రైతులు శుక్రవారం పనులు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ రైల్వేలైన్ నిర్మాణ పనుల్లో తమ పట్టా భూములను కోల్పోయామని, ఇప్పటి వరకు నష్ట పరిహారం చెల్లించలేదన్నారు. పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరిగి వేసారిపోతున్నామని, అయినా పట్టించుకోవడం లేదని వాపోయారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ బాలకృష్ణ అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. తమ సమస్యను జిల్లా అధికారులకు వివరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గజ్వేల్‌రూరల్: పరిసరాల పరిశుభ్రత పాటించినపుడే ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారని శ్రీగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బల్వీందర్‌సింగ్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజ్ఞాపూర్‌లో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్‌గునియా వంటి వ్యాధులు వస్తాయని, వాటిని అరికట్టేందుకు పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది శ్రీనివాస్, సురేందర్, వాసుదేవ్, నాగరాజు, రమేశ్, నిరూప, అరుణ, కనకవ్వ తదితరులు పాల్గొన్నారు.

పల్లె గొంతు తడపండి

మరమ్మతులకు గురైన చేతిపంపులు

- నిధులు కేటాయించని ప్రభుత్వం
- యేడాదిగా రాని బిల్లులు
- డబ్బులు పెట్టేందుకు అధికారుల వెనుకడుగు
- స్వచ్ఛందంగా విరాళాల సేకరణ

హుస్నాబాద్‌రూరల్: చేతి పంపులకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తే ఈ వేసవిలో దాహార్తి తీరుతుందని పల్లె ప్రజలు కోరుతున్నారు. హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో సుమారు 460 చేతిపంపులు ఉన్నాయి. అందులో 120 చేతి పంపులను ప్రజలు వినియోగించుకొంటున్నారు. మిగతావి పాడై నిరుపయోగంగా పడిఉన్నాయి. ఎండలు పెరుగుతుండటంతో చాలా గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడింది. దీంతో ప్రజలు నిత్యావసరాలకు, పశువులకు నీరు పెట్టేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో రాకపోవడంతో అధికారులు మంచి నీటి బావులకు మోటర్లు బిగించి తాగునీటిని సరఫరా చేస్తున్నారు.



గాంధీనగర్‌లో రిపేర్లు చేయిస్తున్న యువత



బంజేరుపల్లిలో చేతిపంపునకు మరమ్మతులు

మరమ్మతులకు నిధులు కరువు

పంచాయతీల పాలకవర్గం 2024 ఫిబ్రవరి నాటికి ముగియడంతో అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. గత యేడాది నీటి సమస్యలు రావద్దని మంత్రి ఆదేశాలు జారీ చేయడంతో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు సొంత డబ్బులు పెట్టి ప్రజలకు తాగునీరు అందించారు. పంచాయతీకి రూ.లక్ష ఇస్తామని చెప్పిన అధికారులు ఇప్పటికీ ఇవ్వలేదు. ఇప్పుడు చేతి పంపులు మరమ్మతులు చేయాలంటే ఒక్కొక్క దానికి రూ.10వేల వరకు ఖర్చవుతుంది. తామ సొంత డబ్బులతో మరమ్మతులు చేయించినా అధికారులు బిల్లులు ఇవ్వరని పనులు చేయడానికి గ్రామాధికారులు ఆసక్తి చూపించడంలేదు. ఇకపోతే ప్రత్యేక అధికారులు అసలు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకొని చేతి పంపుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

“ రెండు బోరింగ్‌లకు రూ.15వేలు

మా ఊరులో పోచమ్మ, హనుమాన్ గడి దగ్గర చేతి పంపులు ఉన్నా పనిచేయడంలేదు. వేసవి కాలం దాహార్తి తీర్చడానికి వాటర్ ట్యాంక్‌లు లేవు, చేతి పంపులకు మరమ్మతులు చేయిస్తే ఉపయోగపడుతుందని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి రెండు చేతి పంపులకు మరమ్మతులు చేయించినం. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చెప్పినా తమ దగ్గర డబ్బులు లేవని దాటవేశారు.

– నీలం కుమార్, గాంధీనగర్

రూ.4లక్షలు మంజూరు

గ్రామాల్లో పైపులైన్ల మరమ్మతుల కోసం రూ.4లక్షలు మంజూరయ్యాయి. అవసరమైన చోట పనులు చేయించి తాగునీరు అందిస్తున్నాం. చేతిపంపుల మరమ్మతులకు ప్రత్యేక నిధులేమీ రాలేదు. పంచాయతీ నిధుల నుంచే రిపేర్లు చేయించుకోవాల్సి ఉంటుంది. చేతి పంపుల పైపులకు ప్రతిపాదనలు పంపించాం. వస్తే గ్రామాల్లో అవసరమైన చోట అందిస్తాం.

– రుహీన, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, హుస్నాబాద్ ”

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కాంగ్రెస్‌తో విసిగిపోయిన ప్రజలు
- ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై ప్రజలు విసిగిపోయారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆచరణలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లడమే లక్ష్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. 27న ఆసియా ఖండంలోనే ఎన్నడూ జరగని విధంగా వరంగల్‌లో బీఆర్ఎస్ బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు నియోజకవర్గం నుంచి 15వేల మందిని తరలించడానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, బీఆర్ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు నవాజ్ మీరా, మాజీ జెడ్పీటీసీ ఎల్లయ్య, నాయకులు మద్దూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిరండి

చిన్నకోడూరు(సిద్దిపేట): వరంగల్‌లో ఆదివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మల్లారం, అనంతసాగర్ గ్రామాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతితో మరింత బాధ్యత

సిద్దిపేటకమాన్: పదోన్నతులు బాధ్యతను పెంచుతాయని సీపీ అనురాధ అన్నారు. చిన్నకోడూరు పీఎస్, బెజ్జంకి పీఎస్, హుస్నాబాద్ పీఎస్‌లలో హెడ్ కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్ఐగా పదోన్నతి పొందిన సంపత్‌కుమార్, మక్సూద్ అలీ, సంపత్‌రెడ్డిని తన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. బాధ్యతగా విధులు నిర్వహిస్తే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. సిద్దిపేట ఏసీపీ మధు, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఆరుగురు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.13,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నేడు భూ భారతిపై అవగాహన

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో రైతులకు భూ భారతి చట్టంపై శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏఓ శివరామకృష్ణ తెలిపారు. కుకునూరుపల్లిలో ఉదయం 10 గంటలకు, కొండపాకలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమాలకు కలెక్టరు మనుచౌదరి, అదనపు కలెక్టరు హమీద్ హాజరవుతారని చెప్పారు. రైతులు పాల్గొనాలనికోరారు.

ఎస్ఐగా నాగరాణి బాధ్యతలు



మొక్కను అందజేస్తున్న నాగరాణి

సిద్దిపేటకమాన్: సిద్దిపేట మహిళ పోలీసు స్టేషన్ ఎస్ఐగా సూరగోని నాగరాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మెదక్ సీసీఎస్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగరాణి ఇక్కడికి బదిలీపై వచ్చారు. శుక్రవారం ఆమె సీఐ దుర్గను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు.

సామూహిక అభిషేకాలకు ఏర్పాట్లు

నేడు శనిత్రయోదశి మహోత్సవం

వర్గల్(గజ్వేల్): రాష్ట్రంలో అరుదైన శనేశ్వరాలయం కొలువైన వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రం శనిత్రయోదశి మహోత్సవ వేడుకలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా శనివారం రాష్ట్ర నలుమూలల నుంచి తైలాభిషేకాల కోసం భక్తులు తరలిరానున్నారు. ఈ మహోత్సవ వేళ శనేశ్వరునికి తిల, తైలాభిషేకం నిర్వహిస్తే దోష నివారణ జరుగుతుందని, శుభాలు కలుగుతాయని భక్తులు భావిస్తారు. ఈ సందర్భంగా క్షేత్రంలో సామూహిక తైలాభిషేకాల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి తెలిపారు. శనివారం 5.30 గంటలకు గణపతి పూజ, శనేశ్వర మూలమంత్ర జపం, తర్పణం, హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు కొనసాగుతాయి. రూ.250 చెల్లించి భక్తులు సామూహిక తైలాభిషేకంలో పాల్గొనవచ్చని చెప్పారు.

రుతుక్రమంపై అవగాహన అవసరం

ప్రముఖ వైద్యురాలు శిరీష



రుతుక్రమంపై అవగాహన కల్పిస్తున్న శిరీష

ప్రశాంతనగర్(సిద్దిపేట): బాలికలకు రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన ఉండాలని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ శిరీష అన్నారు. 'రితుమతి అభియాన్'లో భాగంగా పదోతరగతి బాలికల సందేహాలు.. నివృత్తి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శిరీష మాట్లాడుతూ రుతుచక్రం ప్రారంభం స్త్రీలలో జీవ సంబంధమైన మార్పులలో ఒకటన్నారు. రుతుక్రమ సమయంలో బాలికలు యోగాసనాలతో పాటు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతుల బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ అందించాలన్నారు. కార్యక్రమంలో అగ్రివిజన్ రాష్ట్ర కన్వీనర్ మానస, కళాశాల మహిళా కన్వీనర్ శ్రావణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం



సిద్దిపేటలో సంతాపం తెలుపుతున్న ముస్లింలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు చేసిన దాడి అమానుషమని మస్జిద్–ఉన్–నసీర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ నసీరొద్దీన్, ముస్లిం నాయకులు అన్నారు. పట్టణంలోని పలు మసీద్‌ల వద్ద శుక్రవారం నమాజ్ అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మారణ హోమానికి కారణమైన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫారుక్ హుస్సేన్, మగ్దూం, ముక్తార్, తస్లీమ్, సాజిత్, జుబేర్, ఎజాస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఏ మతమైనా హింసను ప్రోత్సహించదు

గజ్వేల్‌రూరల్: ఏ మతం కూడా హింసను ప్రోత్సహించదని, పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడిని తాము ఖండిస్తున్నామని గజ్వేల్ తంజీముల్ మసీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మతిన్ అన్నారు. తంజీముల్ మసీద్‌లో ఉగ్రవాదుల మారణ హోమాన్ని ఖండిస్తూ ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో హఫీజ్ తాలిబ్ హుస్సేన్, కమిటీ సభ్యులు అక్తరుల్లాబేగ్, సమీర్, అలీ, రియాజ్, వజీర్‌ఖాన్, అక్బర్, యూసుఫొద్దీన్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'తో ప్రజలకు మేలు

ఆర్డీఓ సదానందం



చేర్యాల(సిద్దిపేట): ప్రజలకు మేలు చేసేందుకే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశ పెడుతుందని సిద్దిపేట ఆర్డీఓ సదానందం అన్నారు. శుక్రవారం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరైన ఆయన చట్టంలోని పలు అంశాలను రైతులు, ప్రజలకు వివరించారు. ఈ చట్టం ప్రకారం భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏవైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు వెళ్లాల్సి ఉండేదని, ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా ప్రభుత్వం అవకాశం కల్పించిందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ అహ్మద్ ఖాన్, మార్కెట్ చైర్మన్ శ్వేత, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ, ఆర్ఐ రాజేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి



దుబ్బాకటౌన్: చెక్కు అందస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరంలాంటిదని, ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 122 మంది లబ్ధిదారులకు రూ.37.94లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకు రావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంగరి రవి, యేసురెడ్డి, శ్రీనివాస్ తదిరులు పాల్గొన్నారు.

తొగుటలో..

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.8.77లక్షలు విలువ గల చెక్కులను తొగుటలో శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, విజయ్‌రెడ్డి, కొండల్ రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పోచయ్య, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ప్రవీణ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కృష్ణ, నాయకులు మహిపాల్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనాకర్, నిరంజన్, భూపాల్ రెడ్డి, నర్సింలుగౌడ్, ఉప్పలయ్య, రాజు, రామస్వామి, సత్తయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

చెత్త విభజనకు ప్రత్యేక టీమ్‌లు

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: పట్టణ ప్రజలకు చెత్త విభజనపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. పట్టణంలోని రావూస్ కాలనీలో శుక్రవారం చెత్త విభజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్త విభజనపై అవగాహన కల్పించడానికి నాలుగు టీమ్‌లు ఏర్పాటు చేశామని, ఒక్కో టీమ్‌లో వార్డు అధికారి, మెప్మా రిసోర్స్‌పర్సన్, సూపర్‌వైజర్‌తో పాటు 11 మంది సిబ్బంది ఉంటారన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం, పర్యావరణ అధికారి రవి కుమార్, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలి..

గజ్వేల్‌రూరల్: ఇళ్ల వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో జరుగుతున్న చెత్త సేకరణను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం 16, 17వ వార్డులలో డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల అర్హుల వివరాలను త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

సృజనాత్మకతను వెలికి తీయడానికే..

మిరుదొడ్డి(దుబ్బాక): వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయాలని ఎంఈఓ దోమకొండ అంజాగౌడ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు చిత్రలేఖనం సామగ్రిని అందించారు. కార్యక్రమంలో భూంపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం రాజేందర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ గౌతమి, రిసోర్స్ పర్సన్ యాదయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజేశ్వరి, బాలకృష్ణ, ఇందిర, విద్యావాలంటీర్లు సరిత, సవిత, మాజీ ఎంపీటీసీ ఉమారాణి, నాయకులు బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేటఅర్బన్: వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి రాజ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. నాంచారుపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో అబాకస్, స్పోకెన్ ఇంగ్లిష్, చేతిరాత, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ అంశాలపై పది రోజుల పాటు అందించే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు దేవరాజు, స్రవంతి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **దళారులను నమ్మి మోసపోవద్దు**

గజ్వేల్‌రూరల్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి కోరారు. మండల పరిధిలోని బంగ్లా వెంకటాపూర్, సింగాటం, కొల్గూరు గ్రామాల్లో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

◆ **దివ్యాంగుల హామీలు అమలు చేయండి**

చేర్యాల(సిద్దిపేట): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటాలకు మద్దతు పలకాలని కోరుతూ పలువురు దివ్యాంగులు ఆయనకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. దివ్యాంగులు చేసే పోరాటానికి సీపీఎం అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు అనిల్, సీపీఎం నాయకులు వెంకట్‌మావో, అరుణ్, మల్లేశం, నర్సింహులు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

◆ **కార్మికుల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కార్మికుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని భవన నిర్మాణరంగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మే 1న కార్మిక దినోత్సవం సందర్భంగా ఉదయం కార్మికులతో కలిసి కొండ భూదేవి గార్డెన్‌లో సభ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం, కిషన్, రాములు, కొమురయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సిద్ధంకావాలి**

దుబ్బాక: సమస్యల పరిష్కారానికి మే 7నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరగబోయే సమ్మెకు ఆర్టీసీ కార్మికులు సిద్ధం కావాలని రాష్ట్ర జేఏసీ కన్వీనర్ ఎండీ మౌలానా పిలుపునిచ్చారు. డిపో జేఏసీ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళనను విరమించే ప్రసక్తేలేదన్నారు.

◆ **పరీక్షా కేంద్రాల వద్ద నిబంధనలు**

సిద్దిపేటకమాన్: తెలంగాణ మోడల్ స్కూల్ ఆరు, పదో తరగతి విద్యార్థులకు జరగనున్న ప్రవేశ పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ నిబంధనలు అమలులో ఉంటాయని సీపీ అనురాధ తెలిపారు. 27వ తేదీన కేంద్రాల వద్ద ఉదయం 8 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు.

◆ **సోన్ ప్రయాగకు నిత్యావసరాలు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో సోన్ ప్రయాగకు ఆహార పదార్థాలతో వెళ్తున్న లారీలను మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నదాన సేవా సమితి సభ్యులు నవీన్‌కుమార్, మధుసుదన్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి**

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యార్థుల్లో వ్యాపార ఆవిష్కరణలపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ స్టార్ట్ అప్ మెంటర్ అక్షయ్‌దేశ్‌పాండే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, చెన్నారెడ్డి, కోఆర్డినేటర్ గురుచరణ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రతి శుక్ర, మంగళవారం డ్రైడే పాటించాలి**

సిద్దిపేటకమాన్: ప్రతి శుక్ర, మంగళవారాల్లో డ్రై డే పాటించాలని డాక్టర్ ముద్దసిర్ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట నాసర్‌పూర అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.

◆ **ఎమ్మెల్యే పరామర్శ**

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇటీవల గాయపడిన మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌ను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కవిత, యాదవరెడ్డి, కిరణ్ తదితరులు ఉన్నారు.

◆ **వేడుకగా వేంకటేశ్వర కల్యాణం**

నంగునూరు(సిద్దిపేట): పాలమాకుల వేంకటేశ్వరాలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పూజారి రణధీరాచార్యులు ఆధ్వర్యంలో పద్మావతీ సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బ్రహ్మోత్సవాల్లో ..

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని శ్రీసీతారామ ఉమామహేశ్వరాలయం, శ్రీలక్ష్మీ వెంకటేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా శ్రీలక్ష్మీ వెంకటేశ్వరాలయంలో హరీశ్‌రావుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.